సాక్షి
మంచిర్యాల
శుక్రవారం । 21 । జూలై । 2023



అప్రమత్తతే రక్ష 8లో▸

వానాకాలంలో విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశముంది. విద్యుత్ మోటార్లు, స్టార్టర్ల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులు సూచిస్తున్నారు.



సీఎం దిష్టిబొమ్మ దహనం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అరెస్టును నిరసిస్తూ జిల్లాలోని పలు మండలాల్లో ఆ పార్టీ శ్రేణులు ఆందోళన నిర్వహించారు. సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
28.0 /25.0

వాతావరణం

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. పడమర దిశగా ఈదురు గాలులు బలంగా వీస్తాయి. వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు విద్యాసంస్థలకు సెలవు

మంచిర్యాలఅర్బన్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో శుక్రవారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. గురువారం సెలవుల ప్రకటనపై కాస్త ఆలస్యం కావడంతో విమర్శలొచ్చాయి. ఈ నేపథ్యంలో ముందస్తుగా శుక్రవారం పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ఇస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు భారీ వర్షాల కారణంగా సెలవు ప్రకటించినట్లు డీఈవో యాదయ్య తెలిపారు. గురువారం సగంపూట బడులు నడిపిన ప్రైవేట్ యాజమాన్యాలు శుక్రవారం సెలవు ఇస్తున్నట్లు తల్లిదండ్రులకు సమాచారం అందించారు.

ఏఐసీసీ ఎన్నికల కమిటీ సభ్యుడిగా పీఎస్సార్



ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: తెలంగాణలో జరిగే అసెంబ్లీ ఎన్నికల కోసం ఏఐసీసీ ఎన్నికల కమిటీని గురువారం ప్రకటించింది. 2023 కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిటీ సభ్యులుగా మంచిర్యాలకు చెందిన మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు(పీఎస్సార్)ను నియమించింది. ఆయన నియామకంపై జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

జిల్లాలో 38.6 మిల్లీమీటర్ల వర్షం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో బుధవారం రాత్రి నుంచి గురువారం వరకు 38.6 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. అత్యధికంగా కోటపల్లి మండలంలో 71.4 మిల్లీమీటర్లు, జైపూర్‌లో 58.2, దండేపల్లిలో 57, చెన్నూరులో 55.4, జన్నారంలో 49.2, నెన్నెలలో 42.6, కాసిపేటలో 41.2, నస్పూర్‌లో 38.6, కన్నెపల్లిలో 38.6, బెల్లంపల్లిలో 38.6, వేమనపల్లిలో 37.6, మంచిర్యాలలో 35.8, హాజీపూర్‌లో 32, మందమర్రిలో 27.4, భీమారంలో 21, తాండూర్‌లో 20.6, భీమినిలో 19.2, లక్సెట్టిపేటలో 10.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జూన్ 1నుంచి ఇప్పటివరకు సాధారణ వర్షపాతం 352.3 మిల్లీమీటర్లు కురువాల్సి ఉండగా, 357.5 మిల్లీమీటర్లు నమోదైంది. జైపూర్, చెన్నూర్, కోటపల్లి మండలాల్లో 20 నుంచి 40 శాతం అధిక వర్షపాతం కురువగా, 14 మండలాల్లో 5నుంచి 17 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఒక్క లక్సెట్టిపేట మండలంలో 28 శాతం లోటు వర్షపాతం నెలకొంది.

నులిపురుగుల నివారణ కార్యక్రమం వాయిదా

మంచిర్యాలటౌన్: జిల్లాలోని 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు నులిపురుగుల నివారణ కోసం గురువారం జిల్లావ్యాప్తంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అల్బెండజోల్ మాత్రల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు ప్రభుత్వం భారీ వర్షాల కారణంగా సెలవు ప్రకటించడంతో గురువారం జిల్లాలో చేపట్టాల్సిన కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు తెలిపారు. తదుపరి ఏ రోజున ఈ కార్యక్రమాన్ని చేపట్టేది తెలియజేస్తామని పేర్కొన్నారు.

ఓసీపీలో నిలిచిన బొగ్గు ఉత్పత్తి



వర్షంతో ఓసీపీలో నిలిచిన షావల్స్

శ్రీరాంపూర్: మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో శ్రీరాంపూర్ ఓపెన్ కాస్టుగనిలో బొగ్గు ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. ఏమాత్రం పొడి వాతావరణం లేకపోవడంతో గత మూడు రోజుల్లో ఒక్క షిఫ్ట్‌ను కూడా అధికారులు నడిపించలేకపోయారు. దీంతో క్వారీలో మైనింగ్ ఆపరేషన్స్ ఎక్కడికక్కడే ఆగిపోయాయి. సుమారు 30 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగింది. ఓసీపీ రోజువారీ బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 12 వేల టన్నులు. క్వారీ నుంచి బొగ్గు రాకున్నా అధికారులు ప్రస్తుతం సర్ఫేస్‌లో నిల్వ ఉన్న బొగ్గును రవాణా చేస్తున్నారు. రోజుకు సుమారు 4 వేల టన్నుల బొగ్గును రవాణా చేస్తున్నారు. ఓబీ మాత్రం పూర్తిగా నిలిచిపోయింది. రోజుకు ఓసీపీ నుంచి 30 వేల క్యూబిక్ మీటర్ల మట్టిని వెలికి తీయాల్సి ఉండగా మూడు రోజుల నుంచి మట్టి పెల్ల కూడా బయటకు రాలేదు. క్వారీలోని ఓబీ, కోల్ డంపర్లను ఉపరితలానికి తరలించారు. షావల్స్, ఇతర యంత్రాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. నాలుగు భారీ మోటార్ పంపుల ద్వారా క్వారీలో చేరిన నీటిని ఎప్పటికప్పుడు ఉపరితలానికి తరలిస్తున్నారు. ఏరియా జీఎం, కార్పొరేట్ అధికారులు ఎప్పటికప్పుడు వర్షం, క్వారీలో నిలిచిపోయిన బొగ్గు ఉత్పత్తిని సమీక్షిస్తున్నారు.

పైసలకు పని చేయిస్తాం!

- రెవెన్యూశాఖలో ఆగని దళారుల దందా
- వివాదాస్పద భూములు, పరిహారంలో చేతివాటం
- అధికారి బదిలీ అయితే పెండింగ్‌వన్నీ చక్కబెట్టే ప్రయత్నాలు



గురువారం మంచిర్యాల ఆర్డీవో కార్యాలయానికి వచ్చిన అర్జీదారులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రెవెన్యూ శాఖలో దళారుల దందా ఆగడం లేదు. భూ సమస్యలతో అధికారుల చుట్టూ తిరిగే వారిని ఆసరా చేసుకుని భారీగా దండుకుంటున్నారు. అటు అధికారులు, ఇటు బాధితులకు మధ్యవర్తిత్వం వహిస్తూ రూ.లక్షలు వసూలు చేస్తున్నారు. తహసీల్దార్ల, ఆర్డీవో కార్యాలయాల్లో ఇప్పటికీ దళారుల బెడద తగ్గలేదు. 'ధరణి' రాకముందు ప్రతీది నేరుగా అధికారిని కలిస్తేనే పనులు జరిగేవి. ఇప్పుడు ఈ పోర్టల్ రాకతో మీ సేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకుని సేవలు పొందుతున్నారు. జిల్లాలో భూ సేకరణల్లో అవార్డ్(పరిహారం), వివాదాస్పద భూముల్లో ఇంకా వీరి హవా కొనసాగుతోంది. బాధితులు తమకు మేలు జరుగుతుందనే ఆశతో ఎక్కడ ఎవరికి డబ్బులు ఇచ్చినా అంతా గోప్యంగానే సాగుతోంది. ఒక్కోసారి డబ్బులు ముట్టిన తర్వాత పని కాకపోతే ఆందోళన చెందుతున్నారు. ఈ తరహాలో శ్రీరాంపూర్ ఓసీపీ విస్తరణలో కొందరు నిర్వాసితులకు భారీగా డబ్బులు చేతులు మారింది.

భూ సేకరణలో గోల్‌మాల్

సింగరేణి ఓపెన్‌కాస్టులు, సాగునీటి ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, ఇతర ప్రజా ప్రయోజనాల కోసం జిల్లాలో వందల ఎకరాల భూమిని సేకరిస్తుంటారు. నిర్వాసితులు చట్ట ప్రకారం పరిహారం పొందుతారు. పరిహారంలో డబ్బులతోపాటు నివాస స్థలాలు, మేజర్ సన్ ప్యాకేజీ కలిపి రూ.లక్షల్లోనే ఉంటుంది. దీంతో చాలా చోట్ల అనర్హులు సైతం దరఖాస్తులు చేసుకుని పరిహారం అడుగుతుంటారు. లేనివి ఉన్నట్లు చూపి పరిహారం పొందాలనే వారు కూడా ఉంటారు. సరైన ధ్రువపత్రాలు లేక, కాస్తు, పట్టాల్లో వేర్వేరు, విస్తీర్ణంలో తేడా, పట్టాదారు పేర్లలో తేడా, వారసులు, కోర్టు కేసులు తదితర వివాదాలు ఉంటే వారికి తొందరగా పరిహారం రావు. ఆ సమయంలోనే దళారులు రంగంలోకి దిగి ఈ పనులన్నీ చక్కబెడతారు. ఒక్కొక్కరి నుంచి డబ్బులు వసూలు చేస్తూ, రూ.లక్షలు పోగు చేస్తుంటారు. వీటిని అధికారులకింతా, మాకింత అన్నట్లుగా చెబుతూ పనులు చేయిస్తుంటారు. శ్రీరాంపూర్ ఓసీపీ, ఇందారం ఓసీపీల్లో ఇప్పటికీ కొందరికి పరిహారం రాలేదు. తాళ్లపల్లి, సింగాపురం, రామారావుపేట, దబ్బపల్లిలో వివిధ కారణాలతో పరిహారం నిలిచిపోయింది. ఇక్కడ అర్హులు కంటే అనర్హత ఉన్న వారే ఎక్కువగా ఉండడంతో మధ్యవర్తులను ఆశ్రయించి, పరిహారం పొందేలా ప్రణాళిక వేశారు. కొన్ని ఇళ్లు పరిహారం కోసమే వెలిశాయని అప్పట్లో అధికారులు కూల్చేశారు. మళ్లీ పరిహారం పొందేందుకు ఆఫీసర్లకు ముట్టజెప్పినట్లుగా చెప్పుకుంటున్నారు. పరిహారం ఇప్పిస్తామని స్థానికులు కొందరు దరఖాస్తుదారుల నుంచి డబ్బులు వసూలు చేశారు.

రెవెన్యూలో 'సత్య'మే అంతా..

జిల్లా కేంద్రంలో ఒకరు రెవెన్యూలో అన్నీ తానై వ్యవహరిస్తూ అధికారులకు నోట్లో నాలుకలా మారిపోయాడు. తహసీల్దార్, ఆర్డీవో ఆఫీసుల్లో పని కోసం తనను కలిస్తే చాలనే పేరు సంపాదించుకున్నాడు. చేసేదంతా 'సత్య'మే అన్నట్లుగా భూమి పనులు చేయిస్తున్నారు. జూనియర్ అసిస్టెంట్ నుంచి రెవెన్యూలో ఉన్నత స్థాయి పరిచయాలతో చక్రం తిప్పుతున్నాడు. గురువారం ఉదయం ఆయన మధ్యవర్తిత్వంతో కొన్ని 'పనులు' నడిచాయి. స్థానికంగా ఉన్న పెండింగ్ పనులు ఆర్డీవో ఆఫీసులో కూర్చొని మరీ తమ వారి కోసం పని చేశారు. ఒకవేళ నేరుగా బాధితులు తమ సమస్యలపై ఆఫీసర్‌ను కలిసే భాగ్యం దొరుకుతుందో లేదో తెలియదు కానీ, మధ్యవర్తులతో మాత్రం పని జరుగుతుందనే విషయం అక్కడున్న వారికి అర్థమైపోతుంది. ఈయన లాంటి వారు కొందరు ఈ దందాలు చేసి రూ.కోట్లకు పడగలెత్తినట్లు ఆఫీసర్లే చెబుతారు. బదిలీపై వెళ్లకముందే తన పనులు పూర్తి చేసుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాడు.

వరద ఉధృతిని పర్యవేక్షించాలి

- కలెక్టర్ బాదావత్ సంతోష్
- అధికారులతో సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సంతోష్

నస్పూర్: గత రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా జిల్లాలోని ప్రాజెక్టులు, బ్యారేజీలకు చేరుతున్న వరదనీటి ఉధృతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. గురువారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బి.రాహుల్, ట్రైనీ కలెక్టర్ గౌతమితో కలిసి నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్లంపల్లి ప్రాజెక్టు, మేడిగడ్డ, సరస్వతి, పార్వతి బ్యారేజీలతోపాటు జిల్లాలోని వాగుల్లో చేరుతున్న వరదనీటి పరిస్థితులను పరిశీలించాలని అన్నారు. ఆయా ప్రాజెక్టుల, బ్యారేజీల నీటి నిల్వ సామర్థ్యానికి అనుగుణంగా ఎగువ ప్రాంతాల నుంచి చేరుతున్న వరద నీటిని పర్యవేక్షించాలని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. వరద కారణంగా అత్యవసర పరిస్థితి ఏర్పడితే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని, ప్రజల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో నీటి పారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

115మంది జేపీఎస్‌ల క్రమబద్ధీకరణ !

- నాలుగేళ్లు దాటని వారు మరో 103 మంది
- క్షేత్రస్థాయిలో పనితీరు ఆధారంగా సాగుతున్న ప్రక్రియ
- కమిటీ చైర్మన్‌గా కలెక్టర్, సభ్యులుగా డీఎఫ్‌ఓ, డీసీపీ



మంచిర్యాలలో శాంతియుత నిరవధిక దీక్షలో జేపీఎస్‌లు(ఫైల్)

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జూనియర్ పంచాయతీ కార్యదర్శుల(జేపీఎస్) క్రమబద్ధీకరణ ప్రక్రియ వేగవంతమైంది. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి క్షేత్రస్థాయిలో పనితీరు ఆధారంగా క్రమబద్ధీకరణకు పర్యవేక్షణ సాగుతోంది. జిల్లాలో 218 మంది జేపీఎస్‌లు ఉండగా ఇందులో 115మంది నాలుగేళ్ల ప్రొబేషనరీ కాలం పూర్తి కాగా.. వీరి క్రమబద్ధీకరణ ప్రక్రియ జరుగుతోంది. మిగతా 103 మందికి సంబంధించి మూడు నెలల్లోపు నాలుగేళ్ల ప్రబేషనరీ కాలం ముగియనుంది. జేపీఎస్‌ల క్రమబద్ధీకరణకు కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కమిటీ చైర్మన్‌గా కలెక్టర్, సభ్యులుగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, జిల్లా అటవీ అధికారి, డీసీపీ ఉన్నారు. ఈ కమిటీ వివిధ అంశాల వారీగా 100 మార్కులతో కూడిన నివేదిక ఆధారంగా జేపీఎస్‌ల పనితీరును పరిశీలించి సిఫారసు చేస్తుంది. కలెక్టర్ తుది నిర్ణయం మేరకు రాష్ట్ర కమిటీ నిర్ణయం తీసుకోనుంది.

జిల్లాలో..

జిల్లాలోని 16 మండలాల్లో ఉన్న 310 గ్రామ పంచాయతీల్లో రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులు 51 మంది, జేపీఎస్‌లు 218మంది, అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు 41మంది ఉన్నారు. 218 మందిలో 115 మంది ప్రొబేషనరీ కాలం 2023 ఏప్రిల్ 11నాటితో ముగిసింది. ఇక మిగతా 103 మందిలో మెరిట్ ఆధారంగా తదనంతర కాలంలో జేపీఎస్‌లుగా విధుల్లోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయి. వీరంతా కూడా నాలుగేళ్ల ప్రొబేషనరీ కాలాన్ని పూర్తి చేసుకున్న అనంతరమే రెగ్యులర్ అవుతారు.

క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ

క్రమబద్ధీకరణకు సంబంధించి నియమించిన కమిటీ జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తుంది. గ్రామాల్లో రోడ్లు, కాలువలు, రికార్డులు, తడి, పొడి చెత్త సేకరణ, కాంపోస్ట్ షెడ్, డంప్‌యార్డులు, వైకుంఠధామాలు, క్రీడా ప్రాంగణాల నిర్వహణ, గ్రామసభలు, జేపీఎస్‌ల హాజరు, పన్నుల వసూళ్లు, పల్లెప్రగతి పనులు, పారిశుధ్య పనులు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ తదితర అంశాల్లో 100 మార్కులకు గాను జేపీఎస్ పనితీరు, కార్యకలాపాలను పర్యవేక్షించి నివేదిక తయారు చేస్తున్నారు. స్వచ్ఛభారత్, ఇతర విభాగాల్లో కేంద్ర ప్రభుత్వం అవార్డుల విషయంలో జేపీఎస్ పాత్ర కీలకంగా ఉంది.


ప్రక్రియ ప్రారంభమైంది..



క్రమబద్ధీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. రాష్ట్రస్థాయి కమిటీ మార్గదర్శకాల ఆధారంగా జేపీఎస్‌ల పనితీరు ప్రాతిపదికన రెగ్యులర్ అయ్యే అవకాశం ఉంది. జిల్లాలో 218 జేపీఎస్‌ల్లో 115 మంది క్రమబద్ధీకరణకు కమిటీ క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తోంది. విధుల నిర్వహణ, పనితీరును ప్రామాణికంగా తీసుకుని క్రమబద్ధీకరణ జరుగుతుంది.

– వెంకటేశ్వర్‌రావు, డీపీఓ, మంచిర్యాల

మాజీ మంత్రి రాంచంద్రారెడ్డి అస్తమయం



చిల్కూరి రాంచంద్రారెడ్డి (ఫైల్)



దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డితో రాంచంద్రారెడ్డి (ఫైల్)

- అనారోగ్యంతో ఆస్పత్రిలో కన్నుమూత
- రాజకీయాల్లో 'చిల్కూరి'ది చెరగని ముద్ర
- నేడు స్వగ్రామం ఖోడద్‌లో అంత్యక్రియలు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన మాజీ మంత్రి చిల్కూరి రాంచంద్రారెడ్డి (78) కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతో ఈ నెల 18వ తేదీన హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చేరారు. పరిస్థితి విషమించి గురువారం సాయంత్రం 4.30గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి పోటీచేసిన ఆయన నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి సేవలందించారు. 1990–92 మధ్య కాలంలో అప్పటి సీఎం నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి మంత్రి వర్గంలో రాష్ట్ర చిన్ననీటి పారుదల, మార్కెటింగ్, గిడ్డంగుల శాఖ ఇండిపెండెంట్ మంత్రిగా పని చేశారు. రాజకీయాల్లో అజాతశత్రువుగా పేరు పొందిన ఆయన గ్రామగ్రామాన అభిమానులను సంపాదించుకున్నారు. ఆయన మరణవార్త తెలిసిన వెంటనే పార్టీ శ్రేణులు, కుటుంబీకులు, అభిమానులు దుఃఖసాగరంలో మునిగారు. తన జీవిత చరమాంకం వరకు కాంగ్రెస్ కోసమే పనిచేశారు. తలమడుగు మండలం ఖోడద్ గ్రామంలో 4వ ఏప్రిల్ 1944లో జన్మించిన ఆయన ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌లో స్థిరపడ్డారు. ఆయనకు భార్య లక్ష్మీదేవి ఉన్నారు.

రాజకీయాల్లో చెరగని ముద్ర

పంచాయతీ సమితి అధ్యక్షుడిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన రాంచంద్రారెడ్డి జిల్లా రాజకీయాలపై చెరగని ముద్ర వేశారు. 1978లో తొలిసారి స్వతంత్ర అభ్యర్థిగా ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఆయన అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి చిల్కూరి వామన్‌రెడ్డిపై విజయం సాధించి తన సత్తా చాటారు. 1983లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన ఆయన స్వతంత్ర అభ్యర్థి వామన్‌రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. తిరిగి 1985లో మరోసారి ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలోకి దిగి టీడీపీ అభ్యర్థి లక్ష్మణ్‌రావుపై విజయం సాధించారు. 1989లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన ఆయన టీడీపీ అభ్యర్థి చంద్రకాంత్‌రెడ్డిపై గెలుపొందారు. 1994, 1999 ఎన్నికల్లో ఓటమి చవి చూసిన రాంచంద్రారెడ్డి 2004లో మరోసారి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి టీడీపీ అభ్యర్థి జోగు రామన్నపై విజయం సాధించారు. 2009, 2012 ఎన్నికల్లో జోగు రామన్న చేతిలో పరాజయం పాలయ్యారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికలకు దూరంగా ఉంటూ వచ్చిన ఆయన పార్టీ పటిష్టతకు పనిచేస్తూ వచ్చారు. ఏడుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి, నాలుగుసార్లు గెలుపొందారు. రాష్ట్ర ఇండిపెండెంట్ మంత్రిగానూ సేవలందించారు.

ఇళ్ల స్థలాలిచ్చిన ఘనత ఆయనదే..

నియోజకవర్గ అభివృద్ధికి ఆహర్నిశలు శ్రమించిన రాంచంద్రారెడ్డి పేదల అభ్యున్నతికి ఎంతో పాటుపడ్డారు. పట్టణంలోని రాంనగర్, కేఆర్‌కే కాలనీ, చిల్కూరి లక్ష్మీనగర్, బంగారుగూడ, బట్టిసావర్‌గాం పరిధిలోని సర్వే నంబర్ 170లో వేలాదిమంది నిరుపేదలకు ఇంటి స్థలాలు అందించి పేదల సొంతింటి కలను సాకారం చేసిన ఘనత ఆయనకే సొంతం. జిల్లా కేంద్రంలో రిమ్స్ వైద్య కళాశాల ఏర్పాటు, తాంసి మండలం వడ్డాడి మత్తడివాగు ప్రాజెక్ట్ నిర్మాణం కూడా ఆయన కృషి ఫలితమే. ఎమ్మెల్యేగా ప్రతి గ్రామంలోనూ నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించి పేదలకు సొంతగూడు కల్పించారు.

తుదిశ్వాస వరకూ కాంగ్రెస్‌లోనే..

కాంగ్రెస్‌లో చేరిన నుంచి తుదిశ్వాస విడిచేవరకూ రాంచంద్రారెడ్డి ఇదే పార్టీలో కొనసాగారు. గత ఏప్రిల్ 26న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నిర్వహించిన నిరుద్యోగ గర్జన సభలో రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు. శ్రీరామ నవమి రోజున జన్మించడంతో ఆయన పుట్టినరోజు వేడుకలను అదే పండగ రోజు నిర్వహించేవారు. తులాభారం నిర్వహించి పేదలకు అన్నదానం చేసేవారు. ఆయన అంత్యక్రియలు శుక్రవారం ఉదయం 11గంటలకు తన స్వగ్రామమైన ఖోడద్‌లో నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు.

కోతకు గురైన బతుకమ్మవాగు వంతెన

- సైడ్‌వాల్ మట్టి కొట్టుకుపోతున్న వైనం
- భారీ వర్షాలకు తెగిపోయే ప్రమాదం



దెబ్బతిన్న వంతెనను పరిశీలిస్తున్న కలెక్టర్, డీసీపీ

చెన్నూర్: చెన్నూర్ పట్టణ సమీపంలోని బతుకమ్మ వాగు వంతెన కోసం నిర్మించిన సైడ్‌వాల్ మట్టి వర్షాలకు కోతకు గురవుతోంది. వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రోజురోజుకు మట్టి కొట్టుకుపోతోంది. భారీ వర్షాలు కురిస్తే గత ఏడాది మాదిరిగా అప్రోచ్ రోడ్డు తెగిపోయే ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. విషయం తెలుసుకున్న సీఐ వాసుదేవరావు గురువారం వంతెనను సందర్శించారు. కోతకు గురవుతున్న వంతెన సైడ్‌వాల్ పక్క నుంచి భారీ వాహనాలు రాకపోకలు సాగించకుండా బారికేడ్లను ఏర్పాటు చేయించారు. జాతీయ రహదారి ఇరుపక్కలకు ముళ్ల కంపా విపరీతంగా పెరగడంతో సిబ్బందితో తొలగింపజేశారు. వంతెనపై నుంచి భారీ వాహనాలు నెమ్మదిగా వెళ్లాలని వాహనదారులకు సూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


వర్షాకాలం కావడంతో వాగులు ఉప్పొంగే అవకాశాలు ఉన్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. గురువారం మంచిర్యాల డీసీపీ సుధీర్‌రాంనాథ్ కేకన్‌తో కలిసి గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు దెబ్బతిన్న బతుకమ్మ వాగు వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాలు కురిసే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంతాల్లో అధికారులు పర్యటించి ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. దెబ్బతిన్న వంతెన మరమ్మతులను అధికారులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని సూచించారు. అనంతరం కోటపల్లి మండలంలోని ప్రాణహిత నదిని పరిశీలించారు. తహసీల్దార్ శ్రీనివాస్‌దేశ్‌పాండే, సీఐ వాసుదేవరావు పాల్గొన్నారు.

టీచర్ల సర్దుబాటులో అవకతవకలు

- విచారణకు డీటీఎఫ్ డిమాండ్

మంచిర్యాలఅర్బన్: జిల్లా విద్యాశాఖలో చేసిన టీచర్ల సర్దుబాటులో అవకతవకలు చోటు చేసుకున్నాయని జిల్లా డీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్, జయకృష్ణ ఆరోపించారు. గురువారం స్థానిక డీటీఎఫ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జూలై 6న ఉపాధ్యాయుల సర్దుబాటులో 136మందిని పాఠశాలలకు పంపించారని తెలిపారు. తర్వాత రోజు నుంచి ఎంఈవోలకు తెలియకుండా నేరుగా విద్యాశాఖ ఒక్కో ఆర్డర్ వర్క్ అడ్జస్ట్‌మెంటు రావడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. వేమనపల్లి మండలంలో నీల్వాయి స్కూల్ ఎస్జీటీని జెడ్పీహెచ్‌ఎస్ సీతారాంపల్లి నస్పూర్‌కు పంపడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కన్నెపల్లి మండలం పీఎస్ శికినం ఎస్జీటీని కోటపల్లి మండలం బొప్పారం ప్రాథమిక పాఠశాలకు కేటాయించడమేమిటని ప్రశ్నించారు. ఒక ఉపాధ్యాయుడు తను పనిచేస్తున్న మండలంలో మాత్రమే సర్దుబాటు చేయాలని ఆదేశాలున్న ఇష్టానుసారంగా ఉత్తర్వులు ఇవ్వడం సరికాదని తెలిపారు. సీతారంపల్లికి ఎస్‌ఏ సోషల్ టీచర్ లేరనే వేమనపల్లి మండలం నుంచి తీసుకున్నామని డీఈవో చెబుతున్నారని, టీచర్ల కొరత ఉందని దాటవేస్తున్నారని పేర్కొన్నారు. పదోన్నతుల కోసం వచ్చిన సర్టిఫికెట్ వెరిఫికేషన్ దాదాపు 426 మంది ఎస్‌ఏ సోషల్‌కు ఎస్జీటీలు హాజరయ్యారని వారిలో ఒక్క ఎస్జీటీ సోషల్(ఎస్‌ఏ)లు లేరా అని ప్రశ్నించారు. వేమనపల్లి మండలంలో ఉపాధ్యాయుల కొరత ఉన్నా మంచిర్యాల సమీపానికి ఉపాధ్యాయురాలిని తీసుకురావడంలో అనుమానాలున్నాయని అన్నారు. వేమనపల్లి ప్రాథమిక పాఠశాలలో 131 మంది విద్యార్థులకు ముగ్గురు, పీఎస్ జాజులపేటలో 35 మందికి ఒక్కరే టీచరు ఉన్నారని, ఇక్కడ టీచర్లు అవసరమున్నా సర్దుబాటు చేయలేదని తెలిపారు. అవకతవకలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఉపాధ్యక్షులు కుమార్, కార్యదర్శి శంకర్, సభ్యులు విజయ్, సంతోష్, రాజేశం, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం ప్రదర్శన కేంద్రం ప్రారంభం



ఈవీఎం పనితీరు పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

నస్పూర్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈవీఎం, వీవీపాట్‌ల ప్రదర్శన కేంద్రాన్ని నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో కలెక్టర్ బాదావత్ సంతోష్ గురువారం ప్రారంభించారు. అనంతరం యంత్రాల పనితీరును పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ వచ్చేది ఎన్నికల ఏడాది కావడంతో ప్రజలు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. వివిధ పనుల నిమిత్తం సమీకృత కలెక్టరేట్‌కి వచ్చేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రఓమంలో జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, ట్రైనీ కలెక్టర్ గౌతమి, ఎన్నికల టీటీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి



ఏఓకు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

నస్పూర్: ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్‌మాదిగ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ సురేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సునీల్‌మాదిగ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేపడుతామని బీజేపీ ఇచ్చిన హామీని ఇప్పటికైనా నిలబెట్టుకోవాలని అన్నారు. మాదిగల ఉద్యమానికి తానే నాయకత్వం వహిస్తానని అసెంబ్లీలో ప్రకటించిన ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే పార్లమెంటు వర్షాకాల సమావేశాల సందర్భంగా అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని అన్నారు. ఎస్సీ వర్గీకరణ జరిగితేనే మాదిగ, మాదిగ ఉపకులాల విద్యార్థులు, ఉద్యోగులకు సమాన అవకాశాలు దక్కుతాయని అన్నారు. రాష్ట్ర నాయకులు కళ్లపల్లి నారాయణమాదిగ, కొలుగిరి విజయ్‌మాదిగ, జిల్లా అధ్యక్షుడు కడారి రమేశ్‌మాదిగ, పట్టణ అధ్యక్షుడు అట్కపురం సమ్మయ్యమాదిగ, ఎంఎస్‌ఎఫ్ జిల్లా ఇంచార్జి కొండ్ర ఉదయ్, జిల్లా కన్వీనర్ వడ్కొండ సంజయ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

హోటల్ యజమానికి రూ.8 వేల జరిమానా



జరిమానా విధిస్తున్న కమిషనర్ గంగాధర్

చెన్నూర్: పట్టణంలోని సితార గ్రాండ్ హోటల్‌లో గురువారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇప్ప రాజ్ కుమార్, పర్యావరణ విభాగం ఇంజినీర్ హరికాంత్‌లతో కలిసి మున్సిపల్ కమిషనర్ గంగాధర్ తనిఖీ నిర్వహించారు. మాంసాహారం నిల్వ ఉంచిన హోటల్ యజమానికి రూ.8వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాకాలంలో నిల్వ చేసిన ఆహార పదార్థాలు తింటే కస్టమర్లు అనారోగ్యం పాలవుతారన్నారు. హోటల్ యాజమానులు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం



పోశం (ఫైల్)

తాండూర్(బెల్లంపల్లి): మండలంలోని బోయపల్లి బోర్డు వద్ద జాతీయ రహదారిపై గురువారం కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. చొటపల్లి గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన పోచంపల్లికి చెందిన అల్లకొండ పోశం (50) కాలినడకన రోడ్డు దాటుతుండగా ఆసిఫాబాద్ వైపు నుంచి బెల్లంపల్లి వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కారు డ్రైవర్ అజాగ్రత్తగా, అతివేగంగా డ్రైవింగ్ చేయడం వల్లే ప్రమాదం జరిగిందని ఎస్సై తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుడు రవితేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మందమర్రిలో పట్టపగలే చోరీ

మందమర్రిరూరల్(చెన్నూర్): పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలోని సింగరేణి క్వార్టర్‌లో రియా సిమ్‌టార్స్ ఆఫీస్‌లో విధులు నిర్వహిస్తున్న విజయ్‌కుమార్ ఇంట్లో బుధవారం పట్టపగలే చోరీ జరిగింది. బాధితుని కథనం ప్రకారం బుధవారం ఉదయం సదరు అధికారి తన భార్యతో కలిసి గోదావరిఖనికి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చిచూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. లోనికి వెళ్లిచూడగా బీరువా తలుపులు తెరిచి ఉండడంతోపాటు అందులో దాచిపెట్టిన 12 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై చంద్రకుమార్ క్లూస్ టీంతో ఇంటి పరిసర ప్రాంతంలో పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

గొర్రెల కాపరులు అప్రమత్తంగా ఉండాలి

భీమారం(చెన్నూర్): ఇటీవల వర్షాలు అధికంగా కురుస్తున్న నేపథ్యంలో గొర్రెల కాపరులు అప్రమత్తంగా ఉండాలని గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ చైర్మన్ అశోక్ యాదవ్ సూచించారు. గురువారం మండలంలోని నర్సింగాపూర్ సమీపంలోని అటవీప్రాంతంలో ఉన్న వలస గొర్రెల కాపరులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ముఖ్యంగా వర్షాల కారణంగా గొర్రెలకు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, పశువైద్యాధికారుల సలహాలు తీసుకోవాలన్నారు. రాత్రిపూట గొర్రెలకు రక్షణ కల్పించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని గొర్రెల కాపరులు చెప్పడంతో సోలార్ దీపాలు అందించాలని ప్రభుత్వానికి విన్నవిస్తానని హామీ ఇచ్చారు.

అప్రమత్తతే రక్ష

- వర్షాకాలంలో వ్యవసాయ మోటార్ల వద్ద అప్రమత్తత అవసరం
- జాగ్రత్తలు పాటిస్తేనే ప్రమాదాల నుంచి రక్షణ
- స్వీయ మరమ్మతులు వద్దంటున్న విద్యుత్‌శాఖ అధికారులు



స్టార్టర్ వద్ద మోటార్ ఆన్ చేస్తున్న రైతు

నిర్మల్ ఖిల్లా: కొన్ని రోజులుగా వర్షాలు జోరుగా కురుస్తున్నాయి. దీంతో రైతులు తమ పంట పొలాల్లో బిజీబిజీగా ఉన్నారు. ఇప్పటికే విత్తనాలు నాటడం, వరి నాట్లు వేయడం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలో రైతులు తమ పొలంలోని బోర్లను సిద్ధం చేసుకుంటున్నారు. ముసురుతో పొలాలన్నీ తడిగా ఉండడంతో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువ. పొలాలకు నీరందించే క్రమంలో మోటార్లు, స్టార్టర్లకు విద్యుత్ వైర్లు తగిలి ఉండడం సహజం. దీంతో విద్యుత్ ప్రవహించి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఎక్కువ. చిన్నపాటి అలసత్వంతో రైతులు మృత్యువాత పడిన ఉదంతాలు జిల్లాలో ఎన్నో ఉన్నాయి. ఈ నేపథ్యంలో రైతులు పాటించాల్సిన జాగ్రత్తలపై సాక్షి అందిస్తున్న కథనం.

మోటార్ల వద్ద తడిగా ఉండకుండా చూసుకోవాలి...

ప్రమాదాల నుంచి రక్షించుకోవడానికి మోటార్ల వద్ద తడిగా ఉండకుండా జాగ్రత్త పడాలి. విద్యుత్ మోటార్లను తడి ప్రదేశాల్లో ఉంచకుండా తేమ తగలని పొడి ప్రదేశంలో, కాస్త ఎత్తులో ఏర్పాటు చేసుకోవాలి. మోటార్ పంపు సెట్లను రైతులు విద్యుత్‌పై అవగాహన లేకుండా సొంతంగా మరమ్మతులు చేసుకుంటూ ఉంటారు. దీంతో ప్రమాదాలకు ఆస్కారం ఉంటుంది. మోటారుకు సంబంధించిన ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు సంబంధిత మెకానిక్‌లను సంప్రదించి మరమ్మతులు చేయించుకోవాలి.

విద్యుత్ అధికారుల సూచనలు..

విద్యుత్ స్తంభం నుంచి వ్యవసాయ మోటారుకు మధ్య దూరం ఎక్కువ ఉండకుండా చూసుకోవాలి. విద్యుత్ స్తంభం నుంచి మోటారుకు కరెంట్ నేరుగా సరఫరా కాకుండా మధ్యలో ఫ్యూజ్, బ్యాక్, స్టార్టర్ తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి. విద్యుత్ సరఫరాలో లోపం ఉంటే మెకానిక్‌తో మరమ్మతులు చేయించుకోవాలి. వర్షాలకు తెగిపడిన కరెంట్ తీగలకు, విరిగిన విద్యుత్ స్తంభాలకు విద్యుత్ సరఫరా అయితే వెంటన అధికారులకు తెలియజేసి సరఫరా నిలిపి వేసేలా చర్యలు తీసుకోవాలి. విద్యుత్ పనులు చేస్తున్నప్పుడు మేకులు లేని బూట్లు, తడి తగలని రబ్బరు లేదా ప్లాస్టిక్ చెప్పులు వేసుకోవాలి.

విద్యుత్ స్టార్టర్ల వద్ద..

స్టార్టర్లకు వర్షపు చినుకులు తగలకుండా చెక్క పెట్టెలో అమర్చుకుంటే ప్రమాదాలను నివారించుకోవచ్చు. విద్యుత్ ప్రసరింపజేయని నాణ్యమైన ప్లాస్టిక్ పెట్టెలో విద్యుత్ స్టార్టర్లను అమర్చుకోవడం ద్వారా విద్యుత్ షాక్ లాంటివి నివారించుకోగలుగుతాము. ఒక్కోసారి ఎలుకలు విద్యుత్ తీగలని కొరికివేయడంతో ఇనుప డబ్బాలకు వైర్లు తగిలి, విద్యుత్ ప్రసరించే అవకాశాలు ఉంటాయి. రైతులు ముందు జాగ్రత్తగా విద్యుత్ స్టార్టర్లను చెక్క పెట్టెలో లేదా ప్లాస్టిక్ డబ్బాలలో కాస్త ఎత్తులో అమర్చుకొని వర్షం నీరు చేరకుండా వాటిపైన పైకప్పును ఏర్పరుచుకోవాలి. విద్యుత్ స్తంభం నుంచి వ్యవసాయ క్షేత్రంలోని మోటార్ వరకు నాణ్యమైన విద్యుత్ సర్వీసు వైరును వాడాలి.



ఇలాంటి స్టార్టర్ల వద్ద అప్రమత్తత అవసరం

ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు



విద్యుత్ షాక్‌తో మృత్యువాత పడిన ఎద్దు (ఫైల్)

- గత సోమవారం నర్సాపూర్(జి) మండలంలోని నందన్ గ్రామంలో రూపేష్ అనే రైతుకు చెందిన మేతకు వెళ్లిన గిరిజాతి ఆవు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్‌షాక్‌తో మృత్యువాతపడింది.
- ఏడాదిన్నర క్రితం నిర్మల్ జిల్లా బాసర మండలంలోని కిర్గుల్(కే)కు చెందిన రైతు రాజలింగం(47) విద్యుత్ తీగ తగిలి మృత్యువాతపడ్డాడు.
- ఎనిమిది నెలల క్రితం సారంగాపూర్ మండలంలోని చించోలి బి గ్రామానికి చెందిన శంకర్ ఆవు గడ్డిని మేస్తూ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ కంచెకు తగిలి విద్యుత్‌షాక్‌తో మృతిచెందింది.
- గత సెప్టెంబర్‌లో మామడ మండలంలోని పొనకల్ గ్రామంలో ఒకేరోజు ఇద్దరు వ్యక్తులు విద్యుత్‌షాక్‌తో మృతి చెందారు. మద్దిపడగ మల్లయ్య గొర్రెల కాపరి ఫెన్సింగ్ తీగకు విద్యుత్ ప్రసారం కావడంతో దానికి తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. అదే గ్రామానికి చెందిన ధ్యాగల బొర్రన్న అనే రైతు పొలం గట్టుపై పశుగ్రాసం కోసే క్రమంలో తడిగా ఉన్న ప్రాంతంలో విద్యుత్ ప్రసరించి షాక్‌కు గురై మరణించాడు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి



గత కొన్ని రోజులుగా కురుస్తున్న ముసురు నేపథ్యంలో రైతులు పంట పొలాల్లో వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఈ క్రమంలో విద్యుత్ మోటారు స్టార్టర్ల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. బోర్ల విషయంలో నాణ్యమైన సర్వీస్ వైరును వాడుతూ, స్టార్టర్ బాక్సులు తడి లేని ప్రదేశంలో ఎత్తులో ఏర్పరుచుకోవాలి.

– జయవంత్‌రావు చౌహాన్, ఎస్‌ఈ, విద్యుత్‌శాఖ జిల్లా అధికారి, నిర్మల్

మేరు సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి



మాట్లాడుతున్న గట్టు చందర్

పాతమంచిర్యాల: జిల్లాలోని మేరు సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని సంఘం అడహక్ కమిటీ సభ్యుడు, జిల్లా ఎన్నికల కన్వీనర్ గట్టు చందర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో మేరు సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మేరు సంఘం జిల్లా, మండల కమిటీలకు ఆగస్టు 31లోగా ఎన్నికలు నిర్వహించాలని నాయకులను కోరారు. సమావేశంలో నాయకులు రామగిరి రాజబాపు, మంతెన గట్టయ్య, మాడిశెట్టి సత్యనారాయణ, రాపర్తి కిషోర్, శ్రీనివాస్, అశోక్, చంద్రకాంత్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

గనుల్లో విద్యుత్ ప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న విశ్వనాథ్ బెహరా

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి ఏరియాలోని ఇల్లందు క్లబ్ ఆవరణలో గురువారం గనుల్లో విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏరియా జీఎం మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీజీఎంఎస్ విశ్వనాథ్ బెహరా (డీఎంఎస్ ఎలక్ట్రికల్) హాజరై గనుల్లో ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గురువయ్య (సేఫ్టీ జీఎం కార్పొరేట్) శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి, బెల్లంపల్లి ఏరియా జీఎం దేవేందర్, కేహెచ్‌ఎస్ గుప్తా (సేఫ్టీ ఏజీఎం), రవీందర్ (ఏఎస్‌వో), మందమర్రి ఏరియా ఎస్వోటూ జీఎం రాజేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

జేఎన్టీయూలో సీటు సాధించిన సీవోఈ విద్యార్థులు



అలకటి గణేశ్



భూక్య అరవింద్



ఎనగందుల మౌర్య



పవన్ కళ్యాణ్

బెల్లంపల్లి: పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల సీవోఈ (సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ) విద్యార్థులు జేఎన్టీయూలో సీటు సాధించి సత్తా చాటారు. కళాశాలకు చెందిన అలకటి గణేశ్ (మెకానికల్ ఇంజనీర్), బూక్య అరవింద్ (బయోటెక్నాలజీ), ఎనగందుల మౌర్య (కంప్యూటర్ సైన్స్), తాళ్ల పవన్‌కళ్యాణ్ (సివిల్ ఇంజనీరింగ్) విద్యార్థులు హైదరాబాద్‌లోని జేఎన్టీయూలో సీటు సాధించి సీవోఈ ప్రతిష్టను ఇనుమడింపజేశారని కళాశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులు పేర్కొన్నారు. వీరితో పాటు మరో 18 మంది విద్యార్థులు రాష్ట్రంలోని వివిధ ఇంజనీరింగ్ కళాశాలల్లో సీటు సాధించినట్లు తెలిపారు. సదరు విద్యార్థులను ఎమ్మెల్యే చిన్నయ్య అభినందించారు. పట్టుదలతో చదివి జేఎన్టీయూలో సీటు సాధించడం హర్షనీయమన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కోట రాజ్‌కుమార్, అధ్యాపకులు లక్ష్మీనారాయణ, రవి, శ్రీరామవర్మ, ఎం.రమేశ్, ఎస్.రమేశ్, రాజేశ్, నరేష్ హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలు పెంచాలి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్



జైనూర్ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

నార్నూర్(జైనూర్): ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను పెంచాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. గురువారం జైనూర్ మండలంలోని జైనూర్, పోచంలొద్ది, రాశిమెట్ట, భూసిమెట్ట గిరిజన ఆశ్రమ పాఠశాలలను ఉషెగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని స్టోర్ రూమ్, సరుకుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. జైనూర్ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు బోధించారు. గణితం, ఇంగ్లిష్‌లో విద్యార్థులను ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, ఉత్తీర్ణత శాతం, విద్యాబోధన, వసతులపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీవో మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామర్థ్యాలను పెంచేలా మెరుగైన విద్యా బోధన అందించాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వివరించారు. ఉన్నత చదువులు చదివే విద్యార్థులకు ఐటీడీఏ ద్వారా ప్రోత్సాహం అందిస్తామన్నారు. అనంతరం ఉషెగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలపై పీహెచ్‌సీ వైద్యుడు రాజుకు పలు సూచనలు చేశారు. వర్షాకాలం హైరిస్క్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని, వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. ఆమె వెంట ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వైద్యులు ఉన్నారు.

హైరిస్క్ గ్రామాలపై దృష్టి సారించాలి

కెరమెరి(ఆసిఫాబాద్): హైరిస్క్ గ్రామాలను గుర్తించి వైద్యాధికారులు వాటిపై దృష్టి సారించాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. కెరమెరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. ఆస్పత్రిలో ప్రసూతి, ఇతర వైద్యసేవల గురించి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరమైన చోట వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం కెరమెరి, మోడి ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. తరగతి గదులకు వెళ్లి గణితం, ఇంగ్లిష్‌లో ప్రశ్నలు వేసి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. ఉన్నత చదువులకు ఐటీడీఏ నుంచి ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు.

ప్రమోషన్ వచ్చినా వేతనాల పెంపులేదు

- సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు



మాట్లాడుతున్న మంద నర్సింహారావు

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణిలో కార్మికులకు ప్రమోషన్ వచ్చినా వేతనాలు పెరుగడం లేదని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు పేర్కొన్నారు. గురువారం ఆర్కే 7గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. అండర్ గ్రౌండ్ జనరల్ మజ్దూర్ నుంచి సర్ఫేస్‌లో పై కేటగిరీ ప్రమోషన్లు వచ్చినా వేతనాలు పెరుగడంలేదన్నారు. సెక్యూరిటీ గార్డు, సర్వే విభాగంవంటి డిజిగ్నేషన్లకు మారితే వారికి బేసిక్ తగ్గి వేతనం తగ్గుతుందన్నారు. దీనిపై ఇప్పటి వరకు గెలిచిన సంఘాలు ఏమాత్రం స్పందించడం లేదన్నారు. వీరి పక్షాన సీఐటీయూ పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచి అధ్యక్షుడు బాలాజీ, కార్యదర్శి గోదారి భాగ్యరాజ్, నాయకులు కస్తూరి చంద్రశేఖర్, వెంగళ శ్రీనివాస్, బానేశ్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.


సెక్టోరియల్-3 అధికారిగా హేమలత



హేమలతను సన్మానిస్తున్న అధికారులు

మంచిర్యాలఅర్బన్: జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సెక్టోరియల్-3 (కో-ఆర్డినేటర్) గా గురువారం హేమలత బాధ్యతలు చేపట్టారు. మిట్టపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న హేమలత సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ పరీక్ష రాసి ర్యాంకు సాధించారు. కేజీబీవీలతో పాటు ప్రభుత్వ పాఠశాలల బాలికలకు సంబంధించిన విషయాలపై పర్యవేక్షించనున్నారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ నవీన్, కోఆర్డినేటర్లు శ్రీనివాస్, చౌదరి, ఇన్‌చార్జి ఎఫ్ఏవో సఫ్దర్‌అలీఖాన్ ఆమెను సన్మానించారు.

ఫోన్ అప్పగింత



బాధితునికి ఫోన్ అప్పగిస్తున్న ఖలీల్

బెల్లంపల్లి: పట్టణంలోని అరుణ్ ట్రేడర్స్‌లో పని చేసేందుకు బల్లార్షా నుంచి వచ్చిన సందీప్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఫోన్ పోగొట్టుకున్నాడు. అటుగా వెళ్లిన ఎస్‌కే ఖలీల్ అనే వ్యక్తికి ఫోన్ దొరకడంతో పోలీస్ స్టేషన్‌లో అప్పగించాడు. బాధితుడు సెల్‌ఫోన్ పోయినట్లు సమాచారం ఇవ్వడంతో వన్‌టౌన్ ఎస్సై రమేశ్ ఖలీల్ చేతుల మీదుగా సందీప్‌కు ఫోన్ అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్సై రమేశ్ నిజాయతీగా ఫోన్ అప్పగించిన ఖలీల్‌ను అభినందించారు.

రేషన్ దుకాణానికి తాళం వేసిన గ్రామస్తులు

- కోటాలో కోత విధిస్తున్నారని ఆరోపణ



రేషన్‌షాపు ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

భీమారం(చెన్నూర్): పూర్తిస్థాయి రేషన్‌బియ్యం విడుదల చేయాలని గురువారం మండలంలోని దాంపూర్ గ్రామస్తులు రేషన్ దుకాణం ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం దుకాణానికి తాళం వేశారు. గ్రామానికి చెందిన రేషన్ డీలర్ 9 నెలల క్రితం బియ్యం పంపిణీలో అక్రమాలకు పాల్పడటంతో అధికారులు అతనిపై 6ఏ కేసు నమోదు చేశారు. అనంతరం రికార్డులో 20.70 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు చూపుతున్నా షాపులో బియ్యం లేకపోవడంతో అధికారులు విచారణ చేపట్టారు. దాంపూర్ డీలర్ స్థానంలో కాజిపల్లి డీలర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. షాపులో తక్కువ ఉన్న బియ్యాన్ని తొలగించి పూర్తిస్థాయిలో 38 క్వింటాళ్ల బియ్యం షాపుకి కేటాయించాల్సిన అధికారులు 8 ఎనిమిది నెలలుగా 20.70 క్వింటాళ్లు తక్కువ చేసి ఇస్తుండటంతో బియ్యం అందరికీ రావడం లేదు. గ్రామ డీలర్ పక్కదారి పట్టించిన బియ్యం విషయంలోనే కేసు నమోదు చేసిన అధికారులు వాటిని ప్రతినెల తక్కువ చూపి పంపిణీ చేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ప్రభుత్వం పూర్తిస్థాయి కోటా బియ్యాన్ని అందించేంత వరకు రేషన్ దుకాణం బంద్ చేసి ఉంచాలని తాళం వేస్తున్నట్లు వారు ప్రకటించారు.

దిందా ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు

చింతలమానెపల్లి(సిర్పూర్): మండలంలోని దిందా పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంతో పాటు నిబంధనలు ఉల్లంఘించినందుకు పాఠశాలకు చెందిన అసిస్టెంట్ హెచ్‌ఎం ఎం.కిషన్‌రావు, ఉపాధ్యాయురాలు రాథోడ్ సరస్వతిపై సస్పెన్షన్ విధించినట్లు ఉత్తర్వులో వెల్లడించారు. సదరు ఉపాధ్యాయులు అధికారుల అనుమతి లేకుండా జూలై 15, 18 తేదీలలో పాఠశాలకు గైర్హాజర్ కావడంతో విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల పర్యవేక్షణలో ఉన్నారని అధికారులు గుర్తించారు. ఉపాధ్యాయులకు ప్రభుత్వం గ్రామీణ ప్రాంత అలవెన్సులు మంజూరు చేసినప్పటికీ విధులు నిర్వహించే పరిధిలో ఉండకుండా నిబంధనలకు విరుద్ధంగా దూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నట్లు తెలిపారు. సస్పెన్షన్ సమయంలో సంబంధిత అధికారుల అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్ వదిలి వెళ్లరాదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ విషయమై గూడెం స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సురేందర్‌ను సంప్రదించగా ఉత్తర్వులు గురువారం వచ్చాయని, సదరు ఉపాధ్యాయులకు అందజేయనున్నట్లు తెలిపారు.

'స్కూల్ లీడర్‌షిప్'లో నార్వాయిపేటకు చోటు



స్కూల్ లీడర్‌షిప్ అకాడమీ పుస్తకం

నెన్నెల(బెల్లంపల్లి): మండలంలోని నార్వాయిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు స్కూల్ లీడర్‌షిప్ అకాడమీ పుస్తకంలో చోటు దక్కిందని పాఠశాల ఉపాధ్యాయుడు జలంపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఎస్‌సీఈఆర్‌టీ (స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిసెర్చ్ అండ్ ట్రెనింగ్) స్కూల్ లీడర్‌షిప్ అకాడమీ తెలంగాణ, నేషనల్ సెంటర్ ఫర్ స్కూల్ లీడర్‌షిప్ అకాడమీ ఎన్‌ఐఈపీఏ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్) న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో ఇంపాక్ట్, ఇన్ఫ్లూయెన్స్, ఇన్స్పిరేషన్-2023 పుస్తకంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతమైన 36 ప్రభుత్వ పాఠశాలల కథనాలు ప్రచురితమయ్యాయి. ఇందులో జిల్లాలోని మూడు పాఠశాలలకు చోటు దక్కింది. విద్యారంగంలో వినూత్న ప్రయోగాలు , విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధనాభ్యాసన ప్రక్రియలు, క్షేత్ర పర్యటనలు, ప్రయోగాలు, ప్రత్యక్ష అనుభవం ద్వారా పాఠాల బోధన, టీషర్ట్‌లపై అంతర్గత అవయవాల బొమ్మలు, 'అష్టాచెమ్మాతో అవనిని చుట్టేద్దామా' అనే వివిధ ప్రయోగాత్మక అభ్యాస ప్రక్రియలపై పాఠశాల ఉపాధ్యాయుడు జలంపల్లి శ్రీనివాస్ ప్రత్యేక శ్రద్ధ పెట్టి బోధించడంతో ఆ పాఠశాల లీడర్‌షిప్ స్కూల్ అకాడమీ పుస్తకంలో చోటు సంపాదించుకుంది. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోడూరి శ్రీనివాస్, తోటి ఉపాధ్యాయులు సదయ్య, స్నేహలత మండల ఉపాధ్యాయుల సహకారంతో ఇలాంటి కార్యక్రమాలు చేయగలుగుతున్నామన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి నిబద్ధతతో పనిచేస్తేనే ఉపాధ్యాయుడు సమాజ హితునిగా వెలుగొందుతాడన్నారు.

కిరాణా దుకాణాలపై ఎక్సైజ్ దాడులు



తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని హోల్‌సేల్ అండ్ రిటైల్ కిరాణా దుకాణాలపై గురువారం ఎక్సైజ్ శాఖ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. బెల్లం, పటిక, తదితర నిల్వలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి ఎవరెవరికి ఎంత విక్రయిస్తున్నారో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ నరేందర్ మాట్లాడుతూ గతంలో జిల్లా కేంద్రంలోని వివిధ ప్రధాన దుకాణాల యజమానులను బైండోవర్ చేసినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా బెల్లం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరికి ఎంత విక్రయించినా రికార్డులో పొందుపరచాలని యజమానులకు సూచించారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయన్నారు. ఈ తనిఖీలో ఎస్సై జీవన్‌రెడ్డి, సిబ్బంది రవీందర్‌రెడ్డి, ప్రసాద్, మహేష్ పాల్గొన్నారు.